క్లుప్తంగా

బాలుర గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఈనెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ సాధ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు టీసీ, బోనఫైడ్, కుల, ఆదాయ ధ్రువ పత్రాలను వెంట తీసుకు రావాలన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు ఆదివారం ఉదయం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు జ్యోతి తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థినులు ఉదయం 10 గంటల నుంచే నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల కార్యక్రమానికి ధ్రువపత్రాలను తీసుకొని రావాలన్నారు.

పేరు సరిచూసుకోవాలి

బోథ్: ఓటరు జాబితాలో పేర్లు సరిచూసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని పట్నాపూర్‌లో పోలింగ్ బూత్‌లో ఓటరు జాబితాను పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. సర్పంచ్ పంద్రం సుగణ, కార్యదర్శి మిథున్, బీఎల్‌వో శ్రీనివాస్, శోభ, జంగు పాల్గొన్నారు.

అన్నాభావుసాఠేకు నివాళి

ఇంద్రవెల్లి: బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప విప్లవకారుడు అన్నాభావుసాఠే అని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం మండలంలోని దేవాపూర్‌లో అన్నాభావుసాఠే 103వ జయంతి వేడుకలో పాల్గొన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ భవాళే సత్యానంద్, మర్సుకోల తిరుపతి, బాలరాజ్, ఉత్తం కాంబ్లే, సావంత్ లహుదాస్, జునైద్, కాంబ్లే బాపురావ్, కాటం రమేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇంద్రవెల్లి: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇంద్రవెల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు సులోచన, పంచపుల, సంగీత, అనిత, రాంబాయి పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

ఇచ్చోడ: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాంప్రసాద్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా గృహలక్ష్మి కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ లాగిన్‌కి పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రమేశ్, కార్యాలయం సూపరింటెండెంట్ పుష్పలత, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ముఖరా(కె)లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, వివేకానంద విద్యాలయాల కరస్పాండెంట్ నిఖిన వర్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

ఇచ్చోడ: ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ నాయకులు శనివారం ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావుకు వినతిపత్రం అందచేశారు. పైరవీలకు ఎలాంటి ఆస్కారం లేకుండా, దరఖాస్తులు చేసుకున్న వారి పేర్లను మాత్రమే పరిశీలించాలన్నారు. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యాంసుందర్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

మాంగుర్లలో కోటి వృక్షార్చన

జైనథ్: మండలంలోని మాంగుర్ల గ్రామంలో కోటి వృక్షార్చన కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. స్వాతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, నాయకులు దేవన్న, మోహన్, తానాజీ, ఎఫ్ఆర్‌వో అరుణ, ఎంపీడీవో గజానన్, తహసీల్దార్ శ్యాంసుందర్ పాల్గొన్నారు. తరోడ సమీపంలో కుంగిన వంతెన వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న మిషన్ భగీరథ పైప్‌లైన్‌లను ఎమ్మెల్యే పరిశీలించారు.

బావర్చి అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

కైలాస్‌నగర్: ప్రజల ఆకాంక్షలకనుగుణంగా అనేక అభివృదిద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద శనివారం ఆదిలాబాద్ బావర్చి అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. బావర్చి యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దశల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, సాజిదోద్దీన్, యూనుస్ అక్బానీ, దుర్గం శేఖర్, విజ్జగిరి నారాయణ, అహ్మద్ ఖాన్, మహమ్మద్ మోసిన్ పాల్గొన్నారు.



మార్కెట్లో రాఖీ సందడి

- అందుబాటులో విభిన్న రాఖీలు
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న ప్రజలు

ఆదిలాబాద్: సోదర సోదరీమణుల అనుబంధానికి చిహ్నంగా శ్రావణ పౌర్ణమి రోజున అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి మురిసిపోతారు. వారు దీర్ఘాయుష్షుతో జీవించాలని మనస్ఫూర్తిగా దీవిస్తూ.. తమ అనురాగాన్ని వ్యక్తపరుస్తారు. జీవితాంతం సోదరీమణులకు రక్షగా నిలవాలని సోదరులు భావిస్తారు. తమ ఆత్మీయ అనుబంధం ఎల్లప్పుడు దృఢంగా ఉండాలని రాఖీ పండుగను జరుపుకుంటారు. ఈనెల 30న రాఖీ పండుగ సందర్భంగా మార్కెట్‌ల్లో వివిధ రకాల రాఖీలు అందుబాటులో ఉన్నాయి.

ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రాఖీల అమ్మకానికి ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. రూ. 20 నుంచి రూ. 1000 వరకు రాఖీలు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్లో డిమాండ్లను అనుసరించి వ్యాపారులు పలు భిన్నమైన రాఖీలను అందుబాటులో ఉంచుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు రాఖీల కొనుగోలు కోసం పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

ఆకట్టుకునేలా..



బొమ్మ రాఖీలు

మారుతున్న కాలంతోపాటు రాఖీలు సైతం పలు విభిన్నమైన డిజైన్లలో ఆకట్టుకుంటున్నాయి. ఆడపిల్లలను ఆకర్షించే విధంగా రాఖీలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. ముత్యాలు, రుద్రాక్ష, తక్కువ నాణ్యత గల వజ్రాలు పొదిగిన రాఖీలు, బంగారు పూత రాఖీలు, ముత్యాల జర్దోసి రాఖీలు, దేవుని చిత్రాలతో కూడిన రాఖీలు దర్శనమిస్తున్నాయి. చిన్నపిల్లలను ఆకట్టుకునేలా చోటా భీమ్, మిక్కీ మౌస్, యాంగ్రీ బర్డ్ వంటి బొమ్మలతో కూడిన రాఖీలను సైతం విక్రయానికి ఉంచుతున్నారు.



వజ్రాలు పొదిగిన రాఖీ



దూది రాఖీలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ మండలంలో దత్తత గ్రామాల మరమ్మతు పనుల కారణంగా భుక్తాపూర్ సబ్‌స్టేషన్‌లో గల టౌన్– 6 ఫీడర్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యానగర్, బస్టాండ్ ఏరియా, జెడ్పీ కార్యాలయ ఏరియాలలో ఉదయం 11:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా శేఖర్

బోథ్: బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోథ్ మండలంలోని సూర్యనగర్ గ్రామానికి చెందిన మానాల శేఖర్ నియమితులయ్యారు. అలాగే బీజేవైఎం మండల అధ్యక్షుడిగా గొర్ల కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా బనియ సుందర్‌సింగ్‌లను నియమించారు.

యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా కిరణ్

ఉట్నూర్‌రూరల్: బీజేపీ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉట్నూర్‌కు చెందిన బొడ్డు కిరణ్ నియమితులయ్యారు. శనివారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం నియామక పత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, మండల అధ్యక్షుడు కొలిపాక రాజశేఖర్, దేవిదాస లింగాగౌడ్, బింగి వెంకటేశ్, నిఖిల్‌రెడ్డి, రమేశ్, సత్యం పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

బేల: మండలంలోని పాటన్ గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. మండల ఆయుష్ వైద్యాధికారి అనిత రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సర్పంచ్ ఫైజుల్లాఖాన్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

తాంసి: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని బెల్సరీరాంపూర్ గ్రామంలో కోటి వృక్షార్చనలో భాగంగా పార్క్ ఆవరణలో నాయకులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఎంపీపీ రత్నప్రభ, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్ రూప, ఏపీవో సంగీత, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, సంతోష్, శంకర్, భారత్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డిలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో స్వతంత్ర్య భారత వజ్రోత్సవ కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ చౌహాన్ సునీత, ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో రమేశ్, ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్, ఐకేపీ ఏపీఎం దయాకర్, పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, అగ్నిమాపక, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్: మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శనివారం మిగిలి గ్రామంలో మొక్కలు నాటారు. బోథ్ గురుకుల పాఠశాలలో సర్పంచ్ సురేందర్, సొనాలలో సర్పంచ్ సదానందం, పట్నాపూర్‌లో సర్పంచ్ పంద్రం సుగుణ, గుర్రాల తండడాలో మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్ సింగ్ మొక్కలు నాటారు.

తలమడుగు: మండలంలోని కుచులపూర్ గ్రామంలో ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్, ఎంపీడీవో రమాకాంత్ మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వంద శాతం బతికించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభ దేవ్‌రాం, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు

నార్నూర్: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల కళాశాల ఆవరణంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఎంపీడీవో రమేశ్, కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్, సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంపీపీ పోటే శోభాబాయి, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, మెజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కోరెంగా గాంధారిలు అన్నారు. స్వాతంత్ర వజ్రోత్సవాలు, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. జీవకోటికి మొక్కలే జీవనాధారమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పడ్వాల్ గోపాల్‌సింగ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, ఎంపీడీవో పుష్పలత, ఫారెస్ట్ రేంజ్ అధికారి సంతోష్, పీపీవో సంతోష్, ఏపీవో శ్రీనివాస్, సుఫీయన్, కనక హనుమంత్‌రావ్, నవాబ్‌బేగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఇచ్చోడ: మొక్క నాటుతున్న డీపీవో శ్రీనివాస్

మొక్కలను కాపాడితేనే భవిష్యత్

బేల: నాటిన మొక్కలను కాపాడితేనే భవిష్యత్ మనుగడ ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ అన్నారు. శనివారం మండలంలోని చప్రాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఎంపీవో సుమీర్ హైమద్, అటవీశాఖ బీట్ అధికారి కలేందర్, ఠాక్రే గంభీర్, ప్రమోద్‌రెడ్డి, యాసం సతీష్, మెస్రం దౌలత్ పటేల్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో రూ.40కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఐటీ టవర్ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం పనుల పురోగతిని పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి నాటికి అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫేజ్ వన్ ఐటీ టవర్ అందుబాటులోకి వస్తే వెయ్యి మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సైతం మంజూరు కావడంతో స్థానికంగానే అత్యుత్తమ సాంకేతిక విద్య అందనుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, సునీల్, కలీం పాల్గొన్నారు.

హరితహారంతో పెరిగిన పచ్చదనం

కైలాస్‌నగర్: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టిందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపును పురస్కరించుకుని కోటి వృక్షార్చనలో భాగంగా శనివారం అగ్రజా టౌన్ షిప్ పరిసరాల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, డీఎస్‌వో కిరణ్ కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, తదితరులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న జోగు ప్రేమేందర్

మున్నూరుకాపు ప్లీనరీ విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని జల విహార్‌లో ఆదివారం నిర్వహించే మున్నూరుకాపు ప్లీనరీని విజయవంతం చేయాలని తాలుకా మున్నూరుకాపు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్‌లు కోరారు. శనివారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మున్నూరుకాపు బిడ్డల భవిష్యత్ కోసం విద్యా, ఉద్యోగం, ఉపాధి రంగాలతో పాటు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మున్నూరుకాపు కులస్తుల అభివృద్ధికి ఏడాదికి రూ. 5వేల కోట్లు నిధులు కేటాయించాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మున్నూరుకాపు కులస్తులకు అన్ని పార్టీలు టికెట్లు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో మున్నూర్ కాపు నాయకులు పాల్గొన్నారు.

హరిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తాంసి: హరిత తెలంగాణే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మండలంలోని పొన్నారిలో కోటి వృక్షార్చన కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పచ్చదనం పెరిగిందన్నారు. యావత్ దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తెలంగాణ ఎదిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, సర్పంచ్ అశోక్, వైస్ ఎంపీపీ రేఖ, ఏపీడీ రాథోడ్ రవీందర్, ఎఫ్‌డీవో బర్నోబా, ఎంపీడీవో భూమయ్య, సూర్యప్రకాష్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి హైమద్ ఖాన్, ఎఫ్‌బీవో సాయి, శ్రీధర్‌రెడ్డి, రఘు, లింగారెడ్డి, రమణ, నరేందర్ పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే బాపురావు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఉట్నూర్‌రూరల్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం కేబీ ప్రాంగణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీపీ జైవంత్‌రావుతో కలిసి మొక్కలు నాటారు. అదే మండలంలోని లక్కారం, లింగోజీ తండా, శ్యాంపూర్, హస్నాపూర్ గ్రామాల్లో అటవీ శాఖ, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో అనిత, ఎంపీడీవో తిరుమల, సలీమొద్దీన్, మర్సుకోల తిరుపతి, బొంత ఆశారెడ్డి, ధరణి రాజేశ్, ప్రభాస్, గంగారాం పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

బోథ్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీసాయి సంస్థాన్ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, వైద్యులు రవీంద్ర ప్రసాద్, శ్రీధర్ రెడ్డి, ఎలుక రాజు, స్వామి, దేవేందర్ రెడ్డి, నానాక్ సింగ్ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికే గుర్తింపు

బోథ్: కష్టపడి పని చేసిన వారికే గుర్తింపు ఉంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ సంధ్యారాణి ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనిల్ జాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు శ్రీనివాస్, సుభాష్, రాసం దేవన్న, దేవేందర్, స్వామి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

నేరడిగొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఖబ్రస్తాన్ పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకట రమణ, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మహేందర్ రెడ్డి, శివ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తం..

పరామర్శ

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన సుంకరి శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సర్పంచులు ఉన్నారు.

సన్మానం

బజార్‌హత్నూర్: మండలంలోని చింతలసాంగ్వీ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన విద్యార్థిని సిడం ప్రవళిక నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఖమ్మం మెడికల్ కళాశాలలో ఎస్టీ కేటగిరిలో సీటు సాధించింది. శనివారం మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయులు ప్రవళికను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, రాజేందర్, భగత్ బాపురావ్, స్వప్న పాల్గొన్నారు.

ఎదులాపురం: బీఆర్ఎస్ ఆదిలాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా ఎమ్మెల్యే జోగు రామన్నను ప్రకటించడం పాకాల ఫౌండేషన్ చైర్మన్, నిర్మల్ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల రామచందర్ హర్షం చేశారు. శనివారం ఎమ్మెల్యే జోగు రామన్నను జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సన్మానించారు.

తాంసి: ఇటీవల వీఆర్ఏల నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా నియమితులైన తాంసి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులను గ్రామస్తులు సన్మానించారు. రాఘవేంద్ర జూనియర్ అసిస్టెంట్‌గా, గుగ్గిల జీవన్ వార్డ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కాగా పంచాయతీ కార్యాలయంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, ఉప సర్పంచ్ కాంత్ రెడ్డి, అరుణ్, విలాస్, కల్యాణ్, ప్రసాద్, ముత్తన్న పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

బోథ్: మండలంలోని సొనాల వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు చంద్రయాన్– 3 పై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. రాకెట్, లాండర్, రోవర్ నమూనాలను జాతీయ పతాకం, చంద్రుడు నమూనలను విద్యార్థులు గీశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

పోషకాహార కిట్ల పంపిణీ

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు ప్రవేశపెట్టిన పోషకాహార కిట్లను మండలంలోని శ్యాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ పంపిణీ చేశారు. డాక్టర్ సందీప్‌కుమార్, రవీందర్, భూపతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఉట్నూర్‌రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఉట్నూర్ ఎస్సై మనోహర్ సూచించారు. శనివారం మండలంలోని లింగోజీ తండా ఎక్స్‌రోడ్డులో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆటో యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆశ వర్కర్‌కు న్యాయం చేయాలి

బేల: బేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాప్సి(బి) గ్రామానికి చెందిన ఆశ వర్కర్ గేడాం మౌనికకు న్యాయం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు ఆడ శంకర్, ఉపాధ్యక్షుడు నైతం సీతరాంలు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని కుమురం భీం కాంప్లెక్స్‌లో మాట్లాడారు. వైద్యాధికారి అధికార పార్టీ నాయకులు చెప్పినట్టు వ్యవహరించడం సరికాదన్నారు. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న ఆశ వర్కర్ గేడాం మౌనికను ఇతర గ్రామానికి ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. ఆకారణంగా మూడు నెలల నుంచి వేతనం నిలిపివేశారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు కొరంగే జంగ్‌షా, మడావి చంద్రకాంత్, నైతం పురుషోత్తం, షేకు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కైలాస్‌నగర్: క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటేల్ యూత్ క్లబ్ సభ్యులు, యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి భారీ ఎత్తున యువత బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజాని, అజయ్ పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రామన్న